ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024



వైసీపీ మూకలదాడిలో గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ (ఫైల్)

జర్నలిస్టులపై దాడి.. ప్రజాస్వామ్యానికే ముప్పు



● దాడికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి ● దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి ● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా గళమెత్తిన జర్నలిస్టులు, నాయకులు

జైల్లో ఉండాల్సిన వ్యక్తి పాలకుడైతే..

జైలులో ఉండాల్సిన ఆర్థిక నేరస్థుడు జగన్ పాలకుడిగా మారితే.. ఇలాంటి దాడులే జరుగుతాయి. హత్య కంటే నేరమైంది ఆర్థిక నేరమనే విషయం భారత న్యాయవ్యవస్థ ఎప్పుడో చెప్పింది. 30 కేసుల్లో ముద్దాయిగా ఉన్న ముఖ్యమంత్రి జగన్ జీవితాంతం జైల్లో ఉన్నా సరిపోదు. ఆర్థిక నేరం చేసిన వ్యక్తిని మన ప్రజలు ముఖ్యమంత్రి పీఠం ఎక్కించడంతో ఆయన తన అనుచరుల చేత రాష్ట్రవ్యాప్తంగా అన్ని వ్యవస్థలపై దాడులు చేస్తూ చివరకు జర్నలిస్టులపైన కూడా దాడులు చేయిస్తున్నాడు. 30 సంవత్సరాల వరకు ఈ రాష్ట్రంలో ఎవ్వరూ ఉండకూడదు నేనే ఈ రాష్ట్రాన్ని పరిపాలించాలని ఆలోచనలో ఉన్న ముఖ్యమంత్రి జగన్ వల్ల భవిష్యత్తులో రాష్ట్రానికి, సమాజానికి అత్యంత ప్రమాదం పొంచి ఉంది.

- టి.ఈశ్వర్, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

దాడికి ముఖ్యమంత్రే బాధ్యత వహించాలి..

స్వయంగా ముఖ్యమంత్రే తమ ప్రభుత్వం చేసే అవినీతి అక్రమాలను వెలికితీస్తున్న పత్రికలపై బహిరంగంగా దూషణల కు పాల్పడుతున్నారు. దీనివల్ల వైసీపీ మూకలు ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడికి పాల్పడ్డాయి. కాబట్టి ఈ దాడి కి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జర్నలిస్టుకు మా యాజమాన్యం అండగా నిలిచింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు యాజమాన్యమే తరలించింది.

- గౌనిపల్లె శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్, ఏపీయూడబ్ల్యూజే

జర్నలిస్టులపై దాడి అమానుషం..

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఒక బాధ్యతతో వ్యవహరించే జర్నలిస్టులపై దాడులకు పాల్పడడం అమానుషం. సమాజంలో ఎక్కడ ఏం జరుగుతున్నా వాటిని ప్రజలకు చేరవేసే బాధ్యత జర్నలిస్టులది. అందులో భాగంగానే సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులను, దాడికి ప్రేరేపించిన వారిని వెంటనే అరెస్టు చేసి 307 కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి.

- రామాంజనేయులు, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు



రాయచోటి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు



మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): పాలకులు జర్నలిస్టులపైన దాడికి పాల్పడడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని.. రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడికి పాల్పడిన ఘటనకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్‌తో పాటు పలువురు నాయకులు తెలిపారు. శ్రీకృష్ణపై జరిగిన దాడిని ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ రాజకీయ పార్టీలతో పాటు పలు ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. ఎక్కడికక్కడ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు ఇచ్చారు. పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగితే ప్రజాస్వామ్య మనుగడ ప్రమాదంలో పడుతుందని అన్నారు.

● రాయచోటిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌనిపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు, పాత్రికేయులు నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, రాజంపేట పార్లమెంటు నాయకుడు సుగవాసి బాలసుబ్రమణ్యం, బీజేపీ జిల్లా నాయకుడు చీర్ల శ్రీనివాసయాదవ్, జనసేన నేత రామ శ్రీనివాస్, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు విశ్వనాథ్‌నాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి. ఈశ్వర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు, న్యాయవాది రెడ్డెయ్య, దళితహక్కుల సంఘం నాయకులు సుధీర్, రజకసంఘం నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు రాయచోటి జిల్లా కేంద్రంతో పాటు చుట్టూ ఉన్న మండల కేంద్రాల విలేకరులు కూడా పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం అందరూ కలిసి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

● మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్, జనసేన నాయకులు రాందాస్ చౌదరి, శ్రీరామ రామాంజనేయులు, మైఫోర్స్ మహేశ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ విద్యాసాగర్, మాలమహానాడు సుదర్శనం, బీఎస్పీ నేత బందెల గౌతమ్‌కుమార్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివమురళి, సీపీఎం శ్రీనివాసులు రాస్తారోకో నిర్వహించారు. బీసీ సంఘం నాయకులు రాజశేఖర్, వాల్మీకీసంఘం నాయకులు పొదల నరసింహులు, బలిజ సంఘం నాయకులు ప్రసాద్‌కుమార్‌లు కూడా ధర్నా, రాస్తారోకోలో పాల్గొన్నారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రెస్‌క్లబ్ సభ్యులు ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు.

● పీలేరు నాలుగురోడ్ల కూడలిలో టీడీపీ, జనసేన, కమ్యూనిస్టులతో పాటు మాలమహానాడు, ఎమ్మార్పీఎస్, భారతీయ అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాలుగురోడ్ల కూడలి నుంచి పాత బస్టాండులోని తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషకు వినతిపత్రం అందజేశారు. పీలేరు అర్బన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డికి కూడా వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సురేంద్ర, రామ్మూర్తి, చంద్రయ్య, జయన్న, స్పోర్ట్స్ మల్లి, తదితరులు పాల్గొన్నారు.

● రైల్వేకోడూరులో గాంధీ విగ్రహం వద్ద ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలిపి ఉపతహసీల్దార్ అమరేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ర్యాలీగా వెళ్లి పోలీసులకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జనసేన సీనియర్ నాయకులు పగడాల వెంకటేశ్, పగడాల చంద్రశేఖర్, ముత్యాల కిశోర్ తదితరులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజంపేటలో గాంధీ విగ్రహం వద్ద పలు రాజకీయ నాయకులు, జర్నలిస్టులు తమ నిరసనను తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎంఎస్ రాయుడు, సీనియర్ జర్నలిస్టు మలిశెట్టి సుబ్బనరసింహులు, తదితరులు పాల్గొన్నారు. సీనియర్ పాత్రికేయుడు జయరాజు ఆధ్వర్యంలో పాత్రికేయులు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిప్రతం ఇచ్చారు. మరో బృందం ఏపీయూడబ్ల్యూజే నాయకుడు భాస్కర్ తదితరులు కూడా వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ..

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే ఫోర్త్ ఎస్టేట్‌గా చెప్పబడే పత్రికా వ్యవస్థపైన దాడులు చేయడం చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. ఈ దాడిపై ఇప్పటివరకు సీఎం జగన్, సిద్ధం సభలో ఉన్న వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం దారుణం. విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ మూకలను వారిని ప్రోత్సహించిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి. జర్నలిస్టులు చేపడుతున్న పోరాటాలకు భారతీయ జనతా పార్టీ అండగా నిలుస్తుంది.

- చీర్ల శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి

పాలన చేతగాకనే జర్నలిస్టులపై దాడులు..

ప్రజా మద్దతు కోల్పోయి పాలన చేతగాని వైసీపీ ప్రభుత్వం జర్నలిస్టులపై దాడులకు దిగుతోంది. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించే గొంతుకులను నొక్కేస్తూ దాడులకు దిగడం దుర్మార్గం. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న రా కదలిరా సభకు స్వచ్ఛందంగా జనం తరలిరావడమే కాకుండా ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్న విషయం ముఖ్యమంత్రి తెలుసుకుని ఇటువంటి దాడులకు వైసీపీ నాయకులు దిగుతున్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు.. సిద్ధం సభ నిర్వహిస్తూ, అక్కడ జరిగే అరాచకాలను, లోపాలను బయటకు రాకూడదనే ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలతో దాడి చేయించడం దుర్మార్గం. జర్నలిస్టులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం దిగిపోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

- చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఇప్పుడు జర్నలిస్టుల వంతు..

దేశంలో జరుగుతున్న ఎన్నో కుంభకోణాలను బయటపెట్టి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడిన చరిత్ర దేశ పత్రికా వ్యవస్థకు ఉంది. పత్రికా వ్యవస్థ అనేది సమాజానికి నాల్గవ స్తంభం లాంటిది. అలాంటి వ్యవస్థలో పనిచేసే జర్నలిస్టులు సమాజంలో జరిగే తప్పిదాలను వెలికి తీస్తుంటారు. ఐదు సంవత్సరాలులుగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను వేధింపులకు గురి చేసిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు జర్నలిస్టులపైన పడింది. సిద్ధం సభలో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని రాజంపేట పార్లమెంటులోని టీడీపీ నేతలు, కార్యకర్తలు అందరూ సమిష్టిగా ఖండిస్తున్నాము. భవిష్యత్తులో జర్నలిస్టులు చేసే పోరాటాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలిచి, న్యాయం జరిగే వరకు పోరాడుతుంది.

- సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట పార్లమెంట్ టీడీపీ నాయకుడు



పీలేరులోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, టీడీపీ, జనసేన, వివిధ ప్రజాసంఘాల నాయకులు



రాజంపేటలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు

- అసైన్‌మెంట్ కమిటీలో మేడా వర్గీయుల పేర్లు గల్లంతు
- ఆందోళనకు దిగిన ఆయన వర్గీయులు
- అధికారంలో ఉన్నా న్యాయం జరగలేదని అన్నమయ్యకు వేడుకోలు
- రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బలప్రదర్శన
- పేద రైతులకు భూములు ఇవ్వకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిక



రాజంపేటలోని అన్నమయ్య విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మేడా వర్గానికి చెందిన వైసీపీ ప్రధాన నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 19: మొన్న మల్లెన్న.. నేడు అమరన్న అంటూ ఒకరికొకరు పొగడ్తలతో ముంచెత్తుకున్న రాజంపేట నియోజకవర్గంలోని అధికార పార్టీ వైసీపీ నేతల విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అధికార పార్టీలో ఉన్న తమకు అధికారులే పలకడం లేదని, తమ పార్టీలోని కొందరు నేతలు తమ పనులు కానివ్వడం లేదని, తమను మీరైనా ఆదుకోవాలని వేడుకుంటూ సోమవారం రాజంపేటలోని 108 అడుగుల తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్దకు నిరసన చేసి అన్నమయ్య విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, మంటపంపల్లె, సిద్దవటం, సుండుపల్లె, వీరబల్లి మండలాలకు చెందిన 40 మందికి పైబడి సర్పంచ్‌లు, అనేకమంది ఎంపీటీసీలు ఆయా మండల పార్టీ ప్రధాన ఓ వర్గ నాయకులు వందలాది మందితో రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేయడం రాజంపేట వైసీపీ నేతల మధ్య ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇటీవలే సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి కాదని జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వడం, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడికి రాజ్యసభ పదవి ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. సీఎం ఆదేశాల మేరకు మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి సీఎం జగన్ అమరన్నకు ఎమ్మెల్యే టికెట్టు ఇచ్చారని, ఆయన ఆదేశాల మేరకు ఆయనను 25 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామని స్వయానా ప్రస్తుత రాజ్యసభకు ఏకగ్రీవం కాబోతున్న అభ్యర్థి మేడా రఘునాథరెడ్డి ప్రకటించడం, అందుకు ఎమ్మెల్యే మేడా మద్దతు పలకడం జరిగింది. టికెట్టు కేటాయించిన జడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి అదే స్థాయిలో పొగడ్తలతో ముంచెత్తడం జరిగింది. దీంతో అంతా సర్దుబాటు అయిందనుకున్నారు. ఏమైందో ఏమో కానీ ఒక్కసారిగా నియోజకవర్గంలోని ఒక వర్గం నాయకులంతా ప్రధానంగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి సంబంధించిన 80 శాతం మంది నాయకులు సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమాలలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి సంబంధించిన అనేకమంది నాయకులు సిఫార్సు చేసిన అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో తమ వారికి భూములు రాకుండా ఎంపీ మిథున్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అడ్డుకుని వారి వర్గీయులకే అధికంగా భూములు కేటాయించుకున్నారని నిరసనకు వచ్చిన నాయకులు తెలిపారు.

అన్నమయ్య విగ్రహానికి వినతిపత్రం..

ఆర్డీవో కార్యాలయం వద్ద బల ప్రదర్శన

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గీయుల్లో ప్రధానమైన నందలూరు వైసీపీ కన్వీనర్ అన్నం నాగేంద్ర, ఒంటిమిట్ట మండల సీనియర్ వైసీపీ నాయకుడు శివారెడ్డి, ఒంటిమిట్ట నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, జగన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, గంగిరెడ్డి తదితర 40 మంది పైబడి సర్పంచ్‌లు, పలువురు ఎంపీటీసీలు, అనేకమంది మహిళా రైతులు ఆరు మండలాల నుంచి పెద్దఎత్తున అన్నమయ్య విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ నిరసన తెలిపి అన్నమయ్య విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. అదేవిధంగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని అటు భూములు దక్కని రైతులతోనూ, మహిళా రైతులతోనూ, ఆరు మండలాల నేతలతోనూ కలిసి తమ నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అసైన్‌మెంట్ కమిటీలో నిజమైన రైతులమైన తమకు న్యాయం చేయకపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతులతో కలిసి ఆందోళనలు తీవ్రతరం చేస్తాం..

నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన అర్హులైన పేద రైతులు తమకు అసైన్‌మెంట్ కమిటీలో భూములు కేటాయించాలని రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చాం. అన్ని అర్హతలు ఉండి అత్యంత పేదలైన వీరికి భూములు కేటాయించకపోతే రైతులతో కలిసి తమకు న్యాయం జరిగే వరకు ఆందోళనలు తీవ్రతరం చేస్తాం. పేద రైతులకు భూములు ఇవ్వాలని ఎమ్మెల్యే ద్వారా తాము ఉన్నతాధికారులకు నివేదించాం. అసైన్‌మెంట్ కమిటీలో పెట్టాల్సిన పేద రైతుల పేర్లు పెట్టాం. గ్రామ రెవెన్యూ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు అందరూ కలిసి వీటికి ఆమోదం తెలుపుతూ అసైన్‌మెంట్ కమిటీకి వందలాది మంది పేద రైతుల పేర్లను ప్రధానంగా మహిళా రైతుల పేర్లను చేర్చడం జరిగింది. ఎన్నిసార్లు తిరిగినా తమకు న్యాయం జరగడం లేదు. కావున వెనువెంటనే తమ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

- శివారెడ్డి, సుండుపల్లె మండల వైసీపీ నాయకుడు

న్యాయం చేయకపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధం

మాకు న్యాయం చేయకపోతే ప్రాణాలకైనా తెగిస్తాం. మాది నందలూరు మండలం లేబాక గ్రామం. మా గ్రామంతో పాటు టంగుటూరు, ఇతర ప్రాంతాలకు చెందిన వంద మంది పేద రైతులకు సంబంధించిన 200 ఎకరాలు అసైన్‌మెంట్ కమిటీలో తమ అనుభవంలో ఉన్న భూములను తమకు కేటాయించాలని ఎమ్మెల్యేతో కలిసి సీఎం వద్దకు వెళ్లి చర్చించాం. స్థానిక తహశీల్దారు, కలెక్టర్ వద్దకు కాళ్లరిగేలా తిరిగాం. అయినా అసైన్‌మెంట్ కమిటీలో మాకు అన్యాయం చేశారు. 30 ఏళ్లుగా తమ అనుభవంలో ఉన్న భూములు 25 ఏళ్ల పైబడి మామిడి చెట్లు ఉండి, బ్యాంకు రుణాలు ఇచ్చి, రైతు భరోసా డబ్బులు వేసి, ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించుకొని, 1బి, అడంగల్ ఉండి కేవలం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలివ్వమని కోరితే ఎవ్వరూ పలకడం లేదు. అసైన్‌మెంట్ కమిటీలో పెట్టి మా భూములకు ఇవ్వకపోతే ప్రాణత్యాగానికైనా సిద్ధపడతాం.

- అన్నం నాగేంద్ర, వైసీపీ నందలూరు మండల కన్వీనర్, లేబాక గ్రామం

ఎన్నికల ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నెంబర్

● ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 19: ఎన్నికల ఫిర్యాదులకు ఏర్పాటు చేస్తున్న టోల్‌ఫ్రీ నెంబరును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం సాధారణ ఎన్నికలు 2024కు సంబంధించి ఫిర్యాదుల కొరకు రాయచోటి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయబోయే టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయబోతున్నామని, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎటువంటి ఫిర్యాదునైనా ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు, డీఆర్డీఏ ఏడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పరిష్కరించాలి

స్పందన కార్యక్రమంలో అందిన ప్రజల సమస్యలు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యతగా అర్జీలను పరిష్కరించడం అత్యంత కీలకమన్నారు. రీఓపెన్ కాకుండా అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నా ప్రభుత్వం, అధికారులపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే జగనన్నకు చెబుదాం అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో వేగవంతంగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



టోల్‌ఫ్రీ నెంబరు ప్రదర్శిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

సమయం ఇస్తే.. నిబంధనల ప్రకారం అనుమతులు తెచ్చుకుంటాము

● కాశినాయన ఆలయ నిర్వాహకులు



అధికారులతో మాట్లాడుతున్న జ్యోతిక్షేత్ర నిర్వాహకులు

కాశినాయన ఫిబ్రవరి 19: జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆలయ విషయంలో ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు కొంత సమయం ఇస్తే నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు తెచ్చుకుంటామని ఆలయ నిర్వాహకులు అధికారులను కోరారు. గత కొంతకాలంగా కేంద్ర రిజర్వు ఫారెస్ట్‌లో కాశినాయన ఆలయాన్ని నిర్మించారని ఫారెస్ట్ అధికారులు అభ్యంతర పెడుతూ ఆలయ నిర్మాణాన్ని అడ్డుకుంటూ నిర్వాహకులకు నోటీసులు ఇస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ప్రొద్దుటూరు డీఎఫ్‌వో ప్రదీప్‌రెడ్డి, బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకటరమణ, పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఇతర అధికారులు, ఫారెస్ట్, పోలీసు సిబ్బంది జ్యోతిక్షేత్రం చేరుకున్నారు. అటవీ ప్రదేశంలో అనధికారికంగా చేపట్టిన కట్టడాలు ఎంతమేరకు ఉన్నాయో పరిశీలించి వాటిని ఖాళీచేసి వెళ్లిపోవాలని నిర్వాహకులను కోరారు. విషయం తెలుసుకున్న బద్వేల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు విజయమ్మ, వైసీపీ బద్వేల్ అదనపు సమన్వయకర్త ఎస్.విశ్వనాథ్‌రెడ్డి అధికారులతో మాట్లాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కాశినాయన భక్తులు లక్షల్లో ఉన్నారని ఈప్రాంత వాసులకు అవధూత కాశిరెడ్డినాయన ఆరాధ్యదైవంగా ఉన్నాడన్నారు. అలాంటి ఆధ్యాత్మిక జ్యోతిక్షేత్రానికి ఆవరోధాలు కలిగించవద్దని కోరారు. భక్తులు మనోభావాలు దెబ్బతింటాయని.. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచాలని కోరారు. భక్తుల అభ్యంతరాలు రాజకీయ నాయకుల, నిర్వాహకుల వినతి మేరకు విషయం ఉన్నతాధికారుల దృషికి తీసుకుపోయి కొంతసమయం ఇచ్చేలా చూస్తామని చెప్పి అధికారులు వెళ్లిపోయారు.

మిర్చి...నష్టాల ఘాటు



చిన్నకొమెర్ల గ్రామంలో మిర్చిని ఎండబెట్టిన దృశ్యం

● తెగుళ్లతో తగ్గిన దిగుబడులు

● పతనమైన ధరలు

● ఆందోళనలో రైతన్నలు

మైలవరం, ఫిబ్రవరి 19: మిర్చి రైతులకు ఈ ఏడాది కూడా కలిసిరాలేదు. ప్రకృతి ఒడిదుడుకులను ఎదుర్కొని పంట సాగు చేపట్టినా తీవ్ర వర్షాబావం, తెగుళ్ల బెడద రైతులను కుంగదీసింది. ఈ ఏడాది మిర్చి పూత దశలో ఉన్న సమయంలో తీవ్ర వర్షాబావం ఏర్పడటం, పంటకు తెగుళ్ల సోకటంతా తాలు కాయలు వచ్చాయి. వచ్చిన పంటనైనా అమ్ముకుని పెట్టుబడులైనా రాబట్టుకుందా మనుకుంటే సరైన గిట్టుబాటు ధరలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక సతమతమవుతున్నారు.

పూత దశలో వర్షం లేక...

మండలంలోని కల్లుట్ల, బెస్తవేముల, తొర్రివేముల, నార్జంపల్లి, చిన్నకొమెర్ల, పొన్నంపల్లి, తదితర పంచాయతీల్లో దాదాపు 3,500 ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. ఈ ఏడాది పూత బాగా వచ్చిందనుకునే సమయంలో సరైన వర్షాలు లేక పోవడంతో కాయ దశ వచ్చేసరిగా దిగుబడి బాగా తగ్గింది. దీంతో తాలు కాయలు ఎక్కువగా రావడంతో పంట దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగజారుతున్న ధరలు

ఓ వైపు తెగుళ్ల బెడదతో పంట దిగుబడి తగ్గిపోగా.. మరో వైపు ధరలు కూడా నేల చూపులు చూస్తున్నాయి. గుంటూరు మిర్చి యార్డులలో ధర రోజు రోజుకు పతనమవుతోంది. గత ఏడాది కుబేర రకం మిర్చి క్వింటా రూ.20 వేలు ఉండగా.. ఈ ఏడాది రూ.10-12 వేల మాత్రమే పలుకుతోంది. కోత కూలి ఎకరానికి రూ.40 వేలు, సేద్యాలు 15 వేలు, ఎరువులు, పురుగు మందులకు రూ.50వేలు అన్నీ కలిపి ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి అవుతోంది. ప్రస్తుతం మిరపలో 7-8 క్వింటాళ్లు మించి రాలేదని.. అవి కూడా తాలు కాయలే ఎక్కువగా వచ్చాయని రైతులు వాపోతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పంట దిగుబడికి తోడు ధరలు కూడా తగ్గడంతో అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



మిరపకాయలను కలాల్లో రాశిగా పోస్తున్న రైతులు



తెగుళ్లు సోకడంతో తాలుకాయలుగా మారిన మిర్చి

కౌలు రైతులను ఆదుకోవాలి



నేను 3 ఎకరాల్లో కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశా. పంటకు సరైన సమయంలో వర్షాలు పడక పోవడం, తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గింది. బోరు నీటితో మిర్చి పంటకు నీరు పెట్టినా వర్షాలు పడినట్లు ఉండదు. గత ఏడాది కంటే మిర్చి క్వింటాకు రూ.5 వేల నుంచి 8 వేల వరకు తగ్గడంతో పెట్టుబడులు రావడం గగనమైంది. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- జగన్, రైతు

దిగుబడి బాగా తగ్గింది



గత ఏడాదితో పోల్చితే దిగుబడి చాలా తగ్గింది. ఎకరాకు 200 మనుములు కావాల్సి ఉండగా... ఈఏడాది 100-120 మనుములు మాత్రమే పంట దిగుబడి వస్తోంది. ఓ వైపు పెట్టుబడులు పెరిగి పోగా.. దిగుబడి బాగా తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యాం.

- వెంకటరామిరెడ్డి, రైతు

స్పందన ఫిర్యాదులపై స్పందించండి : ఎస్పీ



బాధితుల సమస్యలపై విచారిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 19: స్పందన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పరిధిలోని నలుమూలల నుంచి వచ్చిన 52 మంది ఫిర్యా దుదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా జిల్లా ఎస్పీకి అందజేశారు. అనంతరం ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

కళాజాత బృందం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన



కళాజాత కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీయంఅండ్‌హెచ్‌వో

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 29 వరకు కళాజాత బృందాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య తెలిపారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణా విభాగం ఆధ్వర్యంలో కళాజాత బృందాలతో వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న ఆయన తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కొండయ్య, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ శాఖాధికారి డాక్టర్ పీ. శైలజ, డెమో డాక్టర్ దేవశిరోమణిల ఆధ్వర్యంలో జెండా ఊపి కార్యక్రమాలు ప్రారంభించారు. జిల్లాలో రెండు కళాజాత బృందాలతో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి, రక్తదానం, సుఖవ్యాధుల కౌన్సెలింగ్ కేంద్రాలు, క్షయవ్యాధుల గురించి వీధి నాటకాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్దేశించిన గ్రామాల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

● పెళ్లి అయిన ఐదు నెలలకే ఘటన



కరీముల్లా మృతదేహం



కరీముల్లా (ఫైల్)

మైదుకూరు, ఫిబ్రవరి 19 : ప్రేమించి ఐదు నెలల క్రితం పెళ్లి చేసుకున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈసంఘటన సోమవారం రాత్రి స్థానిక బద్వేల్ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక వీణా విజయరాజు కాలనీకి చెందిన షేక్ కరీముల్లా (21) నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన రెహనాను ప్రేమించి ఐదు నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. సోమవారం తన ద్విచక్రవాహనంలో అత్తగారి ఊరైన ఆత్మకూ రుకు భార్యతో కలసి బయలుదేరి వెళుతుండగా బద్వేలు రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద బోలేరా పికప్ వాహనం వెనుకవైపు ఢీకొంది. ఈ సంఘటనలో కరీముల్లా అక్కడికక్కడే మృతి చెందగా, భార్య రెహనాకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

స్కూలు వ్యాను బోల్తా.. విద్యార్థులకు గాయాలు



సంఘటనాస్థలంలో బోల్తా పడ్డ వ్యాను

వల్లూరు, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని అంబవరం గ్రామ సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం సాయంత్రం స్కూలు వ్యాను బోల్తాపడిన సంఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు కడపలోని ఓ ప్రైవేటు స్కూలుకు చెందిన వ్యాను విద్యార్థులను ఎక్కించుకుని వల్లూరు, పెండ్లిమర్రి విద్యార్థులను ఇంటికి చేరవేసేందుకు వెళుతున్న సమయంలో మార్గమధ్యలో బోల్తా పడింది. బస్సులో దాదాపు 20 మంది విద్యార్థులు ఉన్నారు, వారిలో కొంత మంది గాయపడ్డారు. వీరిని స్థానికులు గుర్తించి వెంటనే 108 వాహనం ద్వారా కడపకు చికిత్స కోసం తరలించారు. విషయం తెలిసిన వెంటనే వల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

మల్లయ్య కొండకు ప్రత్యేక సర్వీసులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 19: ప్రముఖ శైవక్షేత్రంతం బళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5 గంటలకు, 6.30 గంటలకు తంబళ్లపల్లె మల్లయ్యకొండకు బస్సుల నడుస్తాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్య కొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు.

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవు

● కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో విద్య, వైద్య, విద్యుత్, పోలీసు, ట్రెజరీ, తదితర శాఖల అధికారులతో మార్చి 18 నుంచి 30 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 129 కేంద్రాలలో 25522 మంది విద్యార్థులు పరీక్షలకు హజరుతున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకండా అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

మార్కెట్ యార్డులో హమాలీల ఆందోళన

● తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలి

● మంత్రి అంజద్‌బాషాకు విన్నవించినా ఫలితం శూన్యం



మార్కెట్‌యార్డులో ఆందోళన చేస్తున్న హమాలీలు

కడప (రూరల్) ఫిబ్రవరి 19 : కడప మార్కెట్ యార్డులోని సెక్రటరీ కార్యాలయం ఎదుట హమాలీలు సోమవారం ఆందోళనకు దిగారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని గంటపాటు నినదించారు. చైర్మన్, అధికారుల తీరును ఎండగట్టారు. ఈసందర్భంగా పలువురు హమాలీలు మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో దాదాపు 100 మందికి పైగా హమాలీ పనిచేస్తున్నామని తెలిపారు. తాగడానికి గుక్కెడు మంచినీరు లేక దాహంతో అల్లాడుతున్నా పట్టించుకునే వారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 12వ తేదీ మార్కెట్‌యార్డుకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వచ్చారని, ఆయనకు మాగోడును వెళ్లబోసుకున్నా ఫలితం లేదన్నారు. మార్కెట్ యార్డులో పసుపు, వేరుశనగ ఉత్పత్తుల లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నప్పుడు వాటిలోని దుమ్ము దూళితో ఇబ్బందులు పడుతున్నామని, కనీసం తాగడానికి మంచినీరు లేక గొంతు ఎండిపోతోందన్నారు. తమ ఇక్కట్లను పలుమార్లు మంత్రికి, మార్కెట్ యార్డు చైర్మన్, సెక్రటరీలకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తక్షణం తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని, లేకుంటే నిరధికంగా అందోళనలను చేపడతామని హమాలీలు హెచ్చరించారు.

విద్యుధాఘాతంతో రైతు మృతి



జనార్దన్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య ప్రమీల

సింహాద్రిపురం, ఫిబ్రవరి 19: మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామానికి చెందిన ఎర్రగుడి జనార్దన్‌రెడ్డి (59) అనే రైతు సోమవారం విద్యుధాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ అనీల్‌కుమార్ సమాచారం మేరకు జనార్దన్‌రెడ్డి తన చీనీ తోట వద్ద గల విద్యుత్ మోటర్‌కు సంబందించిన స్టార్టర్ వద్ద విద్యుత్ వైర్లు సరి చేసుకుంటుండగా షాక్‌కు గురయ్యాడు. చుట్టు పక్కల వారు చూసి జనార్దన్‌రెడ్డి కుటుంబీకులకు తెలిపారు. అంతలోపే అక్కడికి వెళ్లేలోపు జనార్దన్‌రెడ్డి అపస్మారక స్థితిలో పడివున్నాడు. దీంతో పులివెందుల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. జనార్దన్‌రెడ్డికి భార్య, కుమారుడు, కూతురు కలరు. మృతుని భార్య ప్రమీల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

ఆటో బోల్తా విద్యార్థులకు గాయాలు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 19: మండలంలోని ఉప్పరపల్లె వద్ద సోమవారం ఆటో బోల్తా పడటంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయా లయ్యాయి. చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందని అమీన, అబ్దుల్లా అనే విద్యార్థులు గాయపడ్డారు. వీరిని హుటాహుటిన గాంధీరోడ్డులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అందులో మూడవ తరగతి చదువుతున్న అమీనాకు తీవ్ర రక్తగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఆటో నడుపుతున్న డ్రైవరు పెద్ద గంగయ్యకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో మొత్తం ఐదుగురు విద్యార్థులు వుండగా.. మరో ముగ్గురు విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ఖాదరుపల్లెకు చెందిన ఈ విద్యార్థులు ప్రతి రోజు ఉదయం ఆటోలో ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం అదే వాహనంలోనే ఇంటికి చేరుకుంటారు. ఈక్రమంలో పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న బైక్ ఆటోను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు రూరల్ పోలీసులు వెల్లడిస్తున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న వైస్ చాన్సలర్ సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 19: వైవీయూలో జరుగుతన్న పీజీ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ సోమవారం తనిఖీ చేశారు. వీసీతో పాటు రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ అధికారులతో మాట్లాడారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

రోకలిబండతో అత్తపై అల్లుడు దాడి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 19: రోకలిబండతో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం మండలం బోనుమలకు చెందిన రెడ్డెమ్మ తన కుమార్తెను నిమ్మ నపల్లి మండలం వెంగంవారిపల్లి పంచాయతి కొండ సానివా పల్లికు చెందిన రమణకు ఇచ్చి వివాహం చేసింది. అయితే అల్లుడు రమణ తన కుమార్తెను కొట్టడంతో అల్లుడిని ఎందుకు కొట్టావని నిలదీసింది. దీంతో అల్లుడు రమణ, తన తమ్ముడు శ్రీనాథ్‌లు ఇంట్లో వున్న రోకలిబండతో దాడి చేయడంతో రెడ్డెమ్మ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబీకులు మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హంద్రీ-నీవా కాలువ ఆక్రమణలను అడ్డుకోవాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి19: మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కాలువను, కాలువ గట్టులను కాపాడాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమల సుదర్శనం డిమాండ్ చేశారు.

సోమవారం హంద్రీ-నీవా ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువ గట్టులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్ర మించి కాలువ గట్టుపై తారు రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. అక్రమణ దారు లపై చర్యలుతీసుకోవాలని లేనిపక్షంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. నాయకులు మనోహర్, చంద్రయ్య, మోహన్, తదితరులుపాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరికి బెయిలు మంజూరు

కడప(రూరల్) ఫిబ్రవరి 19: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి సోమవారం నాల్గవ అదనపు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మేముల మండల పోలీసు స్టేషన్‌లో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దాడి కేసును నమోదు చేశారు. ఈ మేరకు దస్తగిరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పెట్టడంతో మూడు నెలలుగా కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సదరు కేసుకు సంబంధించి సోమవారం దస్తగిరికి నాల్గవ అదనపు జిల్లా కోర్టు (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు) బెయిల్ మంజూరు చేసింది. దస్తగిరి నేడు కడప సెంట్రల్ జైలు నుంచి విడుదల అయ్యే అవకాశం ఉంది. ఇదివరకే ఎర్రగుంట్ల పోలీసులు నమోదు చేసిన మరో అట్రాసిటీ కేసులో రెండు వారాల క్రితమే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

దాల్మియాలో యువకుడు ఆత్మహత్య

మైలవరం, ఫిబ్రవరి 19: దాల్మియా పరిశ్రమలోని రేకులషెడ్డులో బ్యారక్ సైడ్ భాగంలో బీహార్‌కు చెందిన మంగళ్‌కుమార్ (22) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తలమంచిపట్నం ఎస్ఐ హను మంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... బీహార్ రాష్ట్రంలోని కుర్చేలా జిల్లా, తింగర గ్రామానికి చెందిన కుమార్ దాల్మియా పరిశ్రమలో రెండు నెలలుగా పనులు చేస్తుండేవాడు. ప్రేమించిన అమ్మాయి దూరం కావడంతో బాధపడుతూ ఉండేవాడని.. ఈ క్రమంలో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమార్ తండ్రి సుబోద సహాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు వ్యవసాయ మోటార్లు చోరీ

చెన్నూరు, ఫిబ్రవరి 19 : కేసీ ప్రధాన కాల్వ వద్ద రైతులు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న రెండు వ్యవసాయ మోటర్లను ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఇటీవల రబీలో ఆరుతడి పంటల కోసం కేసీ ప్రధాన కాల్వ వద్ద మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన రైతులు త్రిలోకనాథరెడ్డి, ముకుందస్వామిలు మోటార్లను ఏర్పాటు చేసుకోగా ఆదివారం రాత్రి మోటర్లకు ఉన్న పైపులు వైరుతో సహా కోసుకుని చోరీ చేశారు. ఇటీవల కాలంలో మోటార్ల వైర్ల దొంగతనాలు ఎక్కువగా జరిగాయి, ఇప్పుడు ఏకంగా మోటర్లనే దొంగతనం చేయడంతో ఆందోళన పడుతున్నారు. పోలీసులు నిఘా పెట్టి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.



రైల్వేకోడూరులో డీటీ అమరేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



ఒంటిమిట్టలో తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ, కమ్యూనిస్ట్ నాయకులు



పెనగలూరు డీటీ మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రాష్ట్రంలో వైసీపీ అరాచకం

- రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి జర్నలిస్టుపై జరిగిన దాడే నిదర్శనం
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన
- రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నేతలు మద్దతు

రాయచోటిటౌన్/రాజంపేటటౌన్/రైల్వేకోడూరు/నందలూరు/ఓబులవారిపల్లె/ఒంటిమిట్ట/పెనగలూరు/లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయం వెంటాడుతుండడంతో.. రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరుకున్నాయని, ఇందుకు ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో సిద్ధం సభ కవరేజ్ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ మూకలు మూకుమ్మడిగా చేసిన దాడే నిదర్శనమని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. ఈ దుర్ఘటనకు నిరసనగా.. జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌనిపల్లె శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, హక్కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ

జర్నలిస్టులపై దాడులు అమానుషం

- విశ్వనాథ్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

రాప్తాడు సభలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై వైసీపీ మూకలు మద్యం మత్తులో కట్టెలతో, చెప్పులతో విచక్షణా రహితంగా దాడులు చేయడం అమానుషం. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఎక్కడ చూసినా దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు, హత్యలు, మానభంగాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయి. ఇటీవల అంగళ్ల ప్రాంతంలో జరిగిన ఒక కార్యక్రమంలో పోలీసులు అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు విని.. సంఘటనతో సంబంధం లేని వ్యక్తులపై కేసులు పెట్టారు. మరి సిద్ధం సభలో జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారిపై ఎందుకు కేసులు పెట్టలేదో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి.

ఫోటో జర్నలిస్టుపై దాడి సిగ్గుచేటు

- సుధీర్‌కుమార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి

విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాక్షిగా వైసీపీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటు. వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకుల సమక్షంలో మద్యం మత్తులో వైసీపీ మూకలు జర్నలిస్టుపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిస్తే అతనికి రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఆసుపత్రికి తీసుకెళ్లకుండా పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దుర్మార్గం.



కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు, టీడీపీ నేతలు

కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పార్లమెంటు నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు, భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వర్, పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, టీజేపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చీర్ల శ్రీనివాస్‌యాదవ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాథ్‌నాయక్, జనసేన పార్టీ నేత రామా శ్రీనివాస్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్ గౌనిపల్లె శ్రీనివాసులు తదితరులు హాజరై మాట్లాడారు. అనంతరం కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు.

అలాగే రాజంపేట పట్టణంలోని పలు రాజకీయ పార్టీల నేతలు గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సుధాకర్, సీఐటీయూ జిల్లా నేత చిట్వేలి రవికుమార్, మహేష్, న్యాయవాది టి.లక్ష్మీనారాయణ, టీడీపీ ఎస్సీ సెల్ నేత మందా శ్రీను, రెడ్డయ్య, మైనార్టీ నాయకులు అబుబకర్, హ్యూమన్ రైట్స్ నాయకురాలు వాణి పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ఉదయగిరి కళ్యాణ్, టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, పీరు సాహెబ్, కరీం, కార్మిక సంఘ నేతలు ఎం.ఎస్. రాయుడు, సికిందర్, బీజేపీ నేతలు ఆదినారాయణ, నరేంద్రరాజు, వెంకటేశ్వర్లనాయుడు, సంజీవరావు, రవి నాయుడు, నాగేశ్వర చౌదరి పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం

ఆంధ్రజ్యోతి విలేఖరి కృష్ణపై జరిగిన దాడి సిగ్గుచేటని రాజంపేట పట్టణంలోని ఏపీడబ్ల్యూజే నేతలు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే సీనియర్ నాయకులు జయరాజు, దార్ల శ్రీనివాసులు ఆచారి, విశాలాంధ్ర భాస్కర్ పలువురు పత్రికా విలేకర్లు మాట్లాడుతూ దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ ఈశ్వరయ్య, ఓబులేసు, హరి, రఘురామరాజు, సునీల్, సుబ్బయ్య పాల్గొన్నారు.

మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో ...

రాష్ట్రంలో అక్రమ కేసులు బనాయించడం, దాడులు చేయడం వైసీపీ ప్రభుత్వంలో పరిపాటిగా మారాయని జనసేన పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జనసేన నాయకులు పవన్‌కళ్యాణ్‌పై అక్రమ కేసులు బనాయించారని, అలాగే రాప్తాడులో నిర్వహిస్తున్న సీఎం సభలో వైసీపీ గూండాలు విలేఖరిపై దాడి చేయడం అమానుషమన్నారు. జర్నలిస్టులు అంటే ఫోర్త్ పిల్లర్స్ అని, ఒక్క ఛానల్‌ను ప్రత్యేకంగా చూడటం, మరికొన్ని ఛానళ్లపై పక్షపాతిధోరణి వహించడం సిగ్గుచేటన్నారు. రానున్న రోజుల్లో జగన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు రామయ్య, కత్తి సుబ్బరాయుడు, భాస్కర పంతులు, శ్రీనివాసులు, గోపి, చౌడయ్య, వీరయ్య ఆచారి, చెంగల్‌రాయుడు, వీర మహిళలు శిరీష, మాధవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో..

విలేఖరిపై దాడి అప్రజాస్వామికమని, పత్రికా సోదరులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మందా శ్రీనివాసులు అన్నారు. సోమవారం రాజంపేట పట్టణం పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

ఇక రైల్వేకోడూరులో జనసేన సీనియర్ నాయకులు పగడాల వెంకటేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర నాయకులు తోట శ్రీనివాసులు, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు సుబ్బారావులు కెమెరామెన్‌పై దాడిని తీవ్రంగా ఖండిచారు. సోమవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రైల్వేకోడూరు గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్ద కొంత సేపు నిరసన వ్యక్తం చేశారు. ఉప తహసీల్దార్ అమరేశ్వరికి, పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజ, తులసి వెంకటేష్, రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు, జనసేన నాయకులు ముత్యాల కిషోర్, ఉత్తరాది శివకుమార్, జనసేన నాయకురాలు జ్యోతి, మహేష్, రైల్వేకోడూరు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నందలూరులో... టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండించారు. సోమవారం మండల టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..అనంతపురం జిల్లాలో రాప్తాడు కేంద్రంగా జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ పలు ప్రజా సంఘాలు, కార్మిక, కర్షక వర్గాల నాయకులు తీవ్రంగా ఖండించాయి. కార్యక్రమంలో జిల్లా కార్మిక నాయకుడు జయరామయ్య, ప్రజాస్వామ్య

వైసీపీ మూకల దాడి దారుణం

- రెడ్డెయ్య, పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

సిద్ధం సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దారుణం. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియంత పరిపాలన సాగిస్తున్నాడు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ తన గుప్పిట్లో పెట్టుకోవాలన్న లక్ష్యంతో అన్ని వర్గాలపై దాడులు చేస్తున్న ముఖ్యమంత్రి ప్రభుత్వం చేసే తప్పిదాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసే పత్రికా వ్యవస్థపైన కూడా దాడులకు పూనుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం. ఈ దాడిని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలి. మరోసారి ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలు ఇళ్లలో ఉండే పరిస్థితులు కూడా ఉండవు. ఆ ఇళ్లు నాది ఈ స్థలం నాది, ఈ భూమి నాది అంటూ వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకునే పరిస్థితులు వస్తాయి.

రాష్ట్రంలో రాజ్యాంగానికి సమాధి

- శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా నాయకుడు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో జగన్ రాజ్యాంగం నడుస్తోంది. ప్రభుత్వం చేసే తప్పిదాలను వెలికి తీస్తారన్న భయంతో రాప్తాడు సిద్ధం సభలో ఫొటో జర్నలిస్టుపై దాడి చేశారు. చర్లపల్లె జైలుకు శాశ్వతంగా వెళ్లడానికి జగన్ సిద్ధంగా ఉండాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా ఖండిస్తున్నారు.

నాయకులు, సీపీఐ నాయకులు, పలువురు పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో... ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై రాప్తాడులో వైసీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ, కమ్యూనిస్ట్ నాయకులు అన్నారు. రాష్ట్రంలో అరాచక, రౌడీపాలన కొనసాగుతుందనడానికి మీడియాపై దాడి నిదర్శనమన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు రాముకి వినతిపత్రం అందజేసి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు వెంకటనరసయ్య, మండల ప్రధాన కార్యదర్శి రాయుడు, టీడీపీ యువ నాయకుడు రాంప్రసాద్, మోదుగుల నరసింహులు, మోదుగుల హరి, నఫీల్లా, యానాదయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెనగలూరులో.. సీఎం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అని, పెనగలూరు మండల టీడీపీ జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దారు, డీటీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు రాంప్రసాద్‌నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కె.కళాచంద్ర, వాణిజ్య విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు మురళి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ షామీర్, నియోజకవర్గ కార్యనిర్వహక కార్యదర్శి టి.ధనయ్య, జనసేన మండల అధ్యక్షుడు శ్రీహరి, సీపీఐ మండల కార్యదర్శి జి.ఆదినారాయణ, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, పత్రికా విలేకర్లు పాల్గొన్నారు.

అలాగే లక్కిరెడ్డిపల్లెలో... ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండించారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలో వారు వేర్వేరుగా విలేకర్లతో మాట్లాడారు. ఐదేళ్లుగా ఆంధ్ర రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. జర్నలిస్టులపై దాడి బాధాకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



రాజంపేటలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ







రాజంపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మందా శ్రీనివాసులు, రైల్వేకోడూరులో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెల్పుతున్న జర్నలిస్టులు, నందలూరులో సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్,

దరఖాస్తుకు మరో వారం రోజుల గడువు

- సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: వివిధ కారణాలతో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు మరో వారం రోజుల గడువు కేటాయిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు అర్హులైన జర్నలిస్టులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. ఆయా జర్నలిస్టులు, సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం : విశ్వనాథనాయుడు



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న కస్తూరి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం చేస్తోందని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. సోమవారం మండలంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సిద్ధం సభలు పెట్టి, అశుద్ధ మాటలు చెబుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు విరిచెయ్యడానికి జనం కసితో ఉన్నారని, రూ.10 ఇచ్చి రూ.100 దోచుకుంటున్నారన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాల్లో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ బస్సులు, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ప్రైవేటు స్కూలు బస్సులు లాక్కొని జనాలను రాప్తాడు సభకు తరలించారన్నారు. రాప్తాడులో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కెమెరామెన్ క్రిష్ణపై వైసీపీ మూకలు దాడులు చేయడం అమానుషం అని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో అక్రమ కేసులు, అధికార దుర్వినియోగం తప్ప జగన్ సాధించిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకుడు కమతం నాగరాజుయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

సుండుపల్లె, ఫిబ్రవరి 19: జనసేన నియోజకవర్గ నేత అతికారి కృష్ణ ఆర్థిక సహాయంతో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేసినట్లు జనసేన మండల మహిళా నాయకురాలు రెడ్డిరాణి తెలిపారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా 150 మంది పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, స్కేల్, ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా మండల క్రీడాకారులకు ఒక క్రికెట్ కిట్టు, ఒక వాలీబాల్ కిట్టు అతికారి కృష్ణ ఆర్థిక సాయంతో అందజేసినట్లు జనసేన నాయకురాలు రెడ్డిరాణి తెలిపారు. గతంలో అతికారి కృష్ణ సుండుపల్లెలో పర్యటించడంతో తమకు కిట్లు కావాలని కోరడంతో క్రీడాకారుల కోసం రెండు కిట్లను అందజేసినట్లు ఆమె తెలిపారు.

'ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీయొద్దు'

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 19: ఆర్యవైశ్యుల మనోభావాలను కొందరు నాయకులు దెబ్బతీస్తున్నారని యువ ఆర్యవైశ్య నాయకులు పెండ్యాల విజయ్‌కుమార్, తిరుణామల కుమార్, తిరుణామల సత్యనారాయణ, కలువా సోమశేఖర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో ఆర్యవైశ్య పెద్దలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య పాలక వర్గంలో ఉన్న కొందరి నిరంకుశత్వం వల్ల చాలా మంది ఆర్యవైశ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సేవా కార్యక్రమాల్లో ముందుండే వాసవి క్లబ్, వనితా క్లబ్ వారిపై అణచివేతకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుమన్, నిరంజన్‌బాబు, మల్లికార్జున, నరసింహులు, తిరుపాల్, అంబటి గురుచరణ్, కర్నాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో అవగాహన సదస్సు

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 19: రాజంపేట మండల పరిధిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఎస్ స్విజర్లాండ్ దేశం 'ది ఫ్యాక్టర్ - వై' కంపెనీల మధ్య అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీఎస్ విద్యార్థుల, అధ్యాపకుల కొత్త పేటెంట్‌లను, కొత్త ఆవిష్కరణలను ది ఫ్యాక్టర్ వై అనే కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలను నెలకొల్పి వాణిజ్యం చేసేందుకు వీలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుడు చొప్పా గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేకొరెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమం : చమర్తి



విలేకర్లతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 19: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడ్డాయని, ఏ ఒక్క వ్యవస్థ సరిగ్గా పనిచేయడం లేదని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రా కదలిరా.. సభలకు వచ్చే ప్రజల ఆదరణ ఓర్వలేని సీఎం, 52 నియోజకవర్గాల పరిధిలో ఒక బహిరంగ సభను ఏర్పాటు చేయడం, ప్రజారవాణాను స్తంభింపచేసి మీడియా దృష్టి ఆకట్టుకునేలా ప్రయత్నించడం వైసీపీ పాలనకు అద్దం పడుతోందన్నారు. జగన్‌రెడ్డిని నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట: రౌడీయిజంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు రాష్ట్రంలో వైసీపీ నాయకులు దాడి చేస్తున్నారని రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. ఒంటిమిట్ట, రాచపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులతో కలిసి వైసీపీ నాయకులు చేపట్టిన అరాచక అక్రమాలపై ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు పలికి చంద్రబాబు సీఎం అయ్యేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, శ్రీహరి, డాక్టర్ శివ, శివారెడ్డి, రంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా : రమేశ్‌కుమార్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ఎదుర్కొని ప్రజలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలోని ఆర్ఆర్ స్వగృహంలో కార్యకర్తలు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1962 నుంచి తమ తండ్రి స్వర్గీయ రాజగోపాల్‌రెడ్డి, పెదనాన్న సూర్యనారాయణరెడ్డిలు రాజకీయ రంగప్రవేశం లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో రోడ్లు, తాగు, సాగునీరు అందించిన ఘనత తన కుటుంబానిదేన్నారు. ఇక ఉమ్మడి కడప జిల్లాకు టీడీపీ అధ్యక్షునిగా తాను కొనసాగామని, తన సొంత నిధులతో ప్రతి గ్రామంలోను మంచినీటి బోరువేరు తాగునీరు అందించామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేశామని చెబుతున్నారని, అందులో కనీసం రూ.50 కోట్ల పనులైనా చూపించాలని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ ఆర్.సూర్యనారాయణరెడ్డి, తనయుడు ఆర్.నాగేంద్రరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు జయరామ్, మాజీ జడ్పీటీసీలు మోహన్ రెడ్డి, నరసారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్లు కాలాడి ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, సర్పంచులు లక్ష్మీనారాయణ, చంద్రమ్మ, గంగయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

- బీజేపీ కిసాన్‌మోర్చ జోనల్ ఇన్‌చార్జి వెంకట్రామరాజు

సుండుపల్లె, ఫిబ్రవరి 19: అననదానం మహాపుణ్యకార్యమని బీజేపీ కిసాన్ మోర్చ జోనల్ ఇన్‌చార్జి వెంకట్రామరాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బస్‌షెల్టర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసులు, సిద్దేశ్వర, సోమరాజు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి జనం సిద్ధం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి జనం కసితో సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి పాలన ఎవరిదో, విధ్వంసకర పాలన ఎవరిదో చర్చించేందుకు టీడీపీ కుటుంబ సభ్యులందరూ సిద్ధంగా ఉన్నారని, సీఎం జగన్‌రెడ్డి మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. భూటకపు ప్రసంగాలు మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఏ మూల చూసినా అభివృద్ధి కనిపించడం లేదని, ఏ ఊరికి వెళ్లినా ఈ ఐదేళ్ల పాలనలో కేవలం విధ్వంసం మాత్రమే కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. అదే విధంగా రాప్తాడు సభలో విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సంబేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్య యాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అతావుల్లా, టీఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి ఫరూఖ్, గన్‌మెన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం ఆడితే సహించేది లేదు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 19: హోటళ్లు, రెస్టారెంట్లు, పానీపూరి దుకాణదారులు వినియోగదారులకు శుచి, శుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, అలా కాకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం ఆయన ఎస్ఎన్‌కాలనీలోని సాయిబాబా ఆలయం వద్ద పానీపూరి బండిలో పాడైన తినుబండారాలు అమ్ముతున్నారన్న సమాచారంతో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్యలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేస్తామన్నారు.

నేడు జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరులోని ఎస్వీసెట్‌లో జరిగే ప్రాంతీయ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షన్మోహన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్వీసెట్‌కు వెళ్లే నిరుద్యోగుల కోసం పీసీఆర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ లింకులో నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు జిరాక్సు, 20 బయోడేటా ఫారాలు (రెజ్యూమ్‌లు), సర్టిఫికెట్ల జిరాక్సులను తీసుకురావాలని సూచించారు. వందకు పైగా ఐటీ సెక్టార్, బీపీవో, ఎలక్ట్రానిక్, మాన్యుఫాక్చరింగ్, రీటైల్ సెక్టార్లకు సంబంధించిన దాదాపు వందకు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇతర వివరాలకు 81425 09017, 63009 54441 నెంబర్లలో సంప్రదించాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డి సూచించారు.

ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ ప్రక్రియకు మరో వారం రోజుల గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 19: వివిధ కారణాలతో ఇళ్ల స్థలాల కోసం ఇంతవరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 26వరకు గడువు పొడిగించినట్లు ఐ&పీఆర్ కమిషనర్ తెలిపారని డీడీ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టుల సంఘం వినతిమేరకు ప్రభుత్వం గడువును పొడిగించిందన్నారు. ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోని, చేసుకున్నా సబ్మిట్ కొట్టని జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రూ.100 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక అమలు

● పద్మావతి వర్సిటీ వీసీ భారతి


విలేకరులతో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 19: రూ.100 కోట్ల పీఎం ఉష (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) నిధులతో యూనివర్సిటీలో ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తామని పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలో ఆమె మీడియాతో మాట్లాడుతూ బోధన, పరిశోధన రంగాల్లో ప్రమాణాలతో పాటు నాక్ ఏ ప్లస్ గుర్తింపు ఆధారంగా పీఎం ఉష ద్వారా వర్సిటీకి రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో బోధన, పరిశోధన, వసతులు కల్పిస్తామని వివరించారు. ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రాజెక్టులు, ఒప్పందాలు, పరిశోధనలు, తరగతుల్లో ప్రమాణాలను పెంపొందించి, భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఎడెక్స్ పథకం ద్వారా ఏర్పాటైన డిప్లొమో కోర్సులకు మూడువేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రిజిస్ట్రార్ రజని, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.96 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.96 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 70,338 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,741 మంది తలనీలాలు సమర్పించారు.

ఉద్యోగులకు 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి



మాట్లాడుతున్న చిరంజీవి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలు చేసే వరకు 30శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వాలని ఏపీ టీచర్స్ ఫెడరేషన్(1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి కోరారు. టీపీపీఎం స్కూల్‌లో సోమవారం సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ధరల ఆధారంగా ద్రవ్యోల్బణానికి అనుగుణంగా 2023 జూలై 1నుంచి ఐఆర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కరువుభత్యం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల డీఏ ఇవ్వాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, అడ్వాన్స్ సరెండర్ లీవులు, ఏపీజీఎల్ఐ మెడికల్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లకు బకాయిపడ్డ రూ.22,500 కోట్లను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్కే బాబు, ఎస్.వెంకటమునిి, రాష్ట్ర కౌన్సిలర్ మోహన్‌దాస్, గౌరవాధ్యక్షుడు నాగూరయ్య, అదనపు కార్యదర్శి సురేష్, కార్యదర్శి కృష్ణప్రసాద్, ఆడిట్ సభ్యులు రవీంద్ర పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ ప్రేమికులు.. ఒక్కటయ్యారు..!


ప్రేమికులతో మాట్లాడుతున్న డీటీ

పాలసముద్రం, ఫిబ్రవరి 19: ఫేస్‌బుక్ పరిచయం.. ప్రేమగా మారి ఒక టైందా జంట. పాలసముద్రం మండలం గంగమాంబాపురం గ్రామానికి చెందిన దీపిక (19)కి తల్లిదండ్రులు పెళ్లి నిశ్చయం చేశారు. మరో 10 రోజుల్లో పెళ్లి జరగాల్సివుంది. ఈ క్రమంలో ఫేస్‌బుక్ పరిచయంతో ప్రేమికుడిగా తిరుపతి జిల్లా తడ మండలం రామాపురం గ్రామానికి చెందిన విఘ్నేష్ వద్దకు ఈనెల 15న వెళ్లిపోయింది. మేజర్లయిన వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. తల్లిదండ్రులకు విషయం తెలియకపోవడంతో దీపిక కనిపించడం లేదని పాలసముద్రం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు ఆ జంట ఆచూకీ తెలుసుకున్నారు. సోమవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ జానకిరామ్ ఇరువురు తల్లిదండ్రులతో మాట్లాడి, ఇద్దరూ మేజర్లు కావడంతో డీటీ మధుబాబు ఎదుట హాజరుపరిచారు. దీపిక తాను ప్రేమికుడి వెంటనే వెళతానని చెప్పడంతో తల్లిదండ్రులు మిన్నకుండి పోయారు.

ఆటో బోల్తా : ఒకరి మృతి


చంద్రశేఖర్ (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి 19: చంద్రగిరి మండలం, బి.కొంగరవారిపల్లె సమీపంలో అడవి పంది అకస్మాత్తుగా దూరి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఆటో నడుపుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రేణిగుంట సమీపంలోని రామకృష్ణాపురంకు చెందిన చంద్రశేఖర్ (55) రోజు వారి దినపత్రికల కట్టను రేణిగుంట నుంచి చంద్రగిరి మండలం, చిన్నరామాపురం వరకు దినపత్రికలు వేస్తున్నాడు. సోమవారం ఉదయం యధావిధిగా ఆటోలో దినపత్రికలు తీసుకుని చిన్నరామాపురంకు వెళ్తుతుండగా మార్గమధ్యలోని బి.కొంగరవారిపల్లె సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా అడవి పంది దూరింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఆటో నడుపుతున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్రావూరులోనే పోలింగ్ కేంద్రం కొనసాగించాలి


పోలింగ్ బూత్‌ను మార్చవద్దని కలెక్టరేట్‌కు వచ్చిన నర్రావూరు గ్రామస్తులు

చిత్తూరు, ఫిబ్రవరి 19: యాదమరి మండలం నర్రావూరులోనే పోలింగ్ కేంద్రాన్ని కొనసాగించాలంటూ రెండు గ్రామాల ప్రజలు కోరారు. సోమవారం స్పందన సందర్భంగా పలువురు గ్రామస్తులు కలెక్టరేట్‌లో డీఆర్వో పుల్లయ్యకు వినతిపత్రాన్ని ఇచ్చారు. చాలా ఏళ్ల నుంచి నర్రావూరు ఆది ఆంధ్రవాడలోనే పోలింగ్ బూత్ ఉండేదని, అక్కడే ప్రతి ఎన్నికల్లోనూ ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేవారమని తెలిపారు. ఇప్పుడు నర్రావూరులో ఉన్న పోలింగ్ బూత్‌ను మార్చి కోణాపల్లెలో ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారని తెలిపారు. కోణాపల్లెలో పోలింగ్ బూత్ ఉంటే తామంతా నిర్భయంగా ఓటు వేసే పరిస్థితులు లేదన్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నర్రావూరులోనే పోలింగ్ బూత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్వోను కలిసిన వారిలో నర్రావూరు గ్రామస్తులతో పాటు యాదమరి మండల టీడీపీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రబి, తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టరేట్ స్పందనకు 182 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనకు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డీఆర్వోతో పాటు డ్వామా పీడీ రాజశేఖర్, జిల్లా మైనార్టీ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి వినతి పత్రాలను స్వీకరించారు. అధికారుల దృష్టికి మొత్తం 182 అర్జీల రాగా శాఖల వారీగా వాటి వివరాలు.. రెవెన్యూశాఖకు 157, రేషన్‌కార్డులు, పెన్షన్లకు 10, మిగిలిన శాఖలకు 14 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా అర్జీదారుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది.


అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

పోలీసు స్పందనకు 19 అర్జీలు

జిల్లా పోలీసు ఏఆర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాధితుల నుంచి ఏఎస్పీ అరీఫుల్లా వినతిపత్రాలను స్వీకరించారు. వారి సమస్యలను విని పరిష్కారానికి నిర్ణీత సమయంలోగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి మొత్తం 19 అర్జీలు అందగా, వాటి వివరాలు.. భూ తగాదాల కింద 9, కుటుంబ తగాదాల కింద 3, వేధింపులు 2, డబ్బు తగాదాలు 2, దారి తగాదాలు 2 వంతున అర్జీలు అందాయి.

పట్టాలు తప్పిన గూడ్స్

ఆలస్యంగా నడిచిన పలు రైళ్లు


గూడ్స్ రైలు పునరుద్ధరణ పనుల్లో అధికారులు

రేణిగుంట,ఫిబ్రవరి 19: తిరుపతి జిల్లా రేణిగుంట రైల్వే స్టేషన్ దక్షిణం వైపు యార్డులో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. చెన్నయ్‌లోని మేల్పాకం నుంచి కార్ల లోడ్‌తో అసోంలోని ఛాంగ్‌సరికెకు వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం రాత్రి 9.15 గంటలకు పట్టాలు తప్పింది.రేణిగుంట స్టేషన్ లోని రోడ్డు నెంబరు సెవన్‌లోకి వెళుతున్న సమయంలో ఇంజన్ నుంచి మూడవ పెట్టె క్రాసింగ్ వద్ద పట్టాలు తప్పింది.గత ఏడాది కాలంలో ఇదే ప్రాంతంలో మూడుసార్లు ప్రమాదాలు జరగడం గమనార్హం. హుటాహుటిన యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్ సిబ్బంది అక్కడకు చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. సీడీవో ప్రణయ్‌కుమార్,ఐటీఎఫ్ సందీప్ కుమార్‌లతో పాటు పలువురు అధికారులు పనులను పర్యవేక్షించారు. ప్రధానరైలు మార్గంలో ప్రమాదం జరగడంతో చెన్నై నుంచి విశాఖ పట్టణం, ముంబాయి, తిరుపతి, భువనేశ్వర్‌లకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్ళు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి.ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ కట్టడాలను కూల్చేస్తాం!

● కబ్జాదార్లకు మఠం ఫిట్ పర్సన్ హెచ్చరిక

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి హథీరాంజీ మఠం భూముల్లో అక్రమ కట్టడాలను కొనసాగించినట్లయితే కూల్చివేస్తామని మఠం ఫిట్ పర్సన్ జి.రమేష్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతామని, మఠం భూములను విక్రయించి సామాన్యులను మోసగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని మఠం భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించి అక్రమ దందా చేస్తున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. ఆ విధంగా మఠం భూమిని ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మిస్తుండగా ఈనెల 15వ తేదీన రెవిన్యూ అధికారుల సహాయంతో వాటిని తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. అయినా ఇంకా చాలా మంది నిర్మిస్తున్నట్టు సమాచారం అందడంతో సోమవారం వాటిని అడ్డుకునేందుకు తిరుపతి రూరల్ తహసిల్దారు మహబూబ్ చాంద్, మఠం సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులురెడ్డి వెళ్ళగా ఆక్రమణదారులు వారిని చుట్టుముట్టి వాగ్వాదానికి దిగినట్టు వివరించారు. మఠం భూమిలో అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తే వాటిని కూల్చివేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

తిరుపతిలో చోరీ

● 113 గ్రాముల బంగారు ఎత్తుకెళ్లిన దొంగలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 19: ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగలు 113 గ్రాముల బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన తిరుపతి నగరం శివజ్యోతి నగర్‌లో చోటుచేసుకుంది. ఆదివారం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగుచూసింది. శివజ్యోతినగర్‌కు చెందిన ఎం.వినాయకం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య పుట్టింటికిపోవడంతో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఉదయం విధులకు వెళ్లే ఆయన రాత్రి తిరిగి వస్తుంటాడు. ఆదివారం రాత్రి ఆయన వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలకు వెళ్లిచూడగా బీరువా తెరిచి ఉండడమేగాక వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో అలిపిరి పోలీసులకు సమాచారమిచ్చాడు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. 113 గ్రాముల బంగారు నగలు చోరీ అయ్యాయన్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీ, ఐసర్ నేడు జాతికి అంకితం



ఏర్పేడు, ఫిబ్రవరి 19 : ఏర్పేడు వద్ద ఉన్న ఐఐటీ, ఐసర్‌లను కేంద్రప్రభుత్వం జాతికి అంకితం చేయనుంది. కేంద్రీయ విద్యాసంస్థలయిన భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థకు మేర్లపాక రెవెన్యూ పరిధిలో 560 ఎకరాలను, భారతీయ విజ్ఞాన శిక్షణ, మరియు పరిశోధన సంస్థకు జంగాలపల్లి రెవెన్యూ శ్రీనివాసపురం పంచాయతీలో 268 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వంలో కేటాయించిన విషయం తెలిసిందే.అప్పటి నుంచీ జరుగుతున్న భవన నిర్మాణాలు ఇటీవల పూర్తయిన సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ఏర్పాట్లు చేసినట్లు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐసర్ డైరక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు.

సిద్ధం సభకు వెళ్లిన శ్రీవారి బస్సులు మద్యపానంతో అపవిత్రం


● టీడీపీ నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి భక్తులు తిరుమలకు వెళ్లే బస్సులను అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు వినియోగించారని, వాటిలో మద్యపానం సేవించి, బిరియానీలు తిని అపవిత్రం చేశారని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మండిపడ్డారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికులను, శ్రీవారి భక్తులను ఇబ్బంది పెట్టి ఆర్టీసీ బస్సులను సిద్ధం సభకు తరలించారన్నారు. సభలో సీఎం జగన్ రెడ్డి మాట్లాడుతుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేయడం దారుణమన్నారు. సీఎంపై హత్యాయత్నం కేసు పెట్టాలని డిమాండు చేశారు. ఫ్యాన్ రెక్కలు విరిచేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయల వరకు దారి మళ్లించారని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయకులు శాంబోళ హరినాథ్, మనోహరాచారి, చెంగయ్య, గిరీష పాల్గొన్నారు.

రుయాలో చెదల నివారణకు నెలకు రూ.5 లక్షలట !



రుయాస్పత్రి పరిపాలన భవనం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 19 : ఆస్పత్రి ఆవరణలో మహా అయితే చెత్తాచెదారం ఉంటుంది. కానీ చెదల నివారణ ఏజన్సీ పేరుతో రూ.లక్షలు స్వాహా చేస్తున్న పరిస్థితి రుయాస్పత్రి, ఎస్వీ వైద్య కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి పరిధిలో నెలకొంది. ఈ ఆస్పత్రుల పరిధిలో చెదలు నివారణ చర్యలు చేపట్టేందుకు 2021 జూన్‌లో ఒక ఏజన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఆ ఏజన్సీ తరఫున సబ్ కాంట్రాక్టు కింద బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ కొంతకాలం ఆస్పత్రి పరిసరాల్లో అరకొర చెదల నివారణ చర్యలు చేపట్టారు. వచ్చే బిల్లుల్లో అధికారుల చేతులు తడపలేక తప్పుకున్నాడు. తర్వాత ఆ బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారనేది రహస్యంగానే ఉంది. అయినప్పటికీ చెదల నివారణ పేరుతో ఇప్పటికే రూ.1.60 కోట్లను అధికారులు బిల్లులు చేశారు. రుయాస్పత్రిలో కొందరు అధికారులు పారిశుధ్య ఏజన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్న కాంట్రాక్టరుతో కుమ్మక్కై చెదల నివారణ పేరుతో నెలకు రూ.5 లక్షలు వారి జేబుల్లో వేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా చెదలు నివారణ చర్యలు చేపట్టేందుకు నిబంధనల మేరకు ఐదుగురు కార్మికులు, ఇద్దరు సూపర్‌వైజర్లను నియమించాలి. పిచికారి చేసే రసాయనాలు, స్ప్రేలు కొనుగోలు చేయాలి. కానీ ఇక్కడ అవేమీ జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల్లోని కొందరినే చెదలు నివారణ సిబ్బందిగా చూపుతూ నిధులు స్వాహా చేస్తున్నారు. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ పేరుతోనే బిల్లులు చెల్లిస్తున్నాం

ఈ విషయమై రుయాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ చెదల నివారణకు సంబంధించి మొదట్లో ఒప్పందం కుదుర్చుకున్న ఏజన్సీ పేరుతోనే ఇప్పటికీ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. సబ్ కాంట్రాక్టర్లు కొందరు మారినా బిల్లులు మాత్రం ఒప్పందం కుదుర్చుకున్న ఏజన్సీకి చెల్లిస్తున్నామని తెలిపారు. ఏజన్సీ తరఫున నలుగురు సిబ్బంది ఆస్పత్రిలో చెదలు నివారణ చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఏవైనా అవకతవకలు జరుగుతుంటే పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు.

చిన్నప్పటి నుంచే తిరుమలకు వస్తున్నా



హీరోయిన్ శ్రీలీల

తిరుమల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నప్పటి నుంచీ తరచూ తిరుమలకు వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం తనకు అలవాటని హీరోయిన్ శ్రీలీల చెప్పారు.సోమవారం ఉదయం ఆమె తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..కుటుంబ సమేతంగా శ్రీవారిని మరోమారు దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుతో పాటు తనకు వివిధ భాషల్లో అవకాశాలొస్తున్నాయని,త్వరలో అన్ని వివరాలనూ ప్రకటిస్తానన్నారు. కాగా, ఆలయం ముందు శ్రీలీలను చూసేందుకు యాత్రికులు ఎగబడ్డారు.ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

ఏసీబీ వలలో వీఆర్వో

కేవీబీపురం, ఫిబ్రవరి 19 : కేవీబీపురం మండలంలోని కోవనూరు వీఆర్వోగా పని చేస్తున్న మునిరాజ సోమవారం ఓ రైతు వద్ద రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ ఏఎస్పీ దైవప్రసాద్ కథనం మేరకు ...కర్లపూడి గ్రామానికి చెందిన శేఖర్ విద్యుత్ కనెక్షన్ నిమిత్తం వాల్గా సర్టిఫికెట్ కావాలంటూ సంవత్సర కాలంగా తిరుగుతున్నాడు.చివరకు వీఆర్వో మునిరాజ రూ.20వేలు డిమాండ్ చేయడంతో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు.వారిచ్చిన సమాచారంతో కేవీబీపురంలోని ఒక కూల్‌డ్రింక్ దుకాణంలో రైతు శేఖర్ నుంచి రూ.5వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.మునిరాజపై కేసు నమోదు చేశారు. డీఎస్పీ ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్, సునీల్ కుమార్, ఎల్‌వీ నాయుడు, ఎస్ఐ సూర్య నారాయణ తదితరులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

● పెల్లుబికిన నిరసనలు● నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి ● ప్రతిపక్షాలు, జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతల డిమాండ్

మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేస్తున్న టీడీపీ,జనసేన, సీపీఐ, సీపీఎం, కుల సంఘాలు, ప్రజాసంఘాలు





బి కొత్తకోటలో ధర్నా చేస్తున్న పాత్రికేయులు, అఖిలపక్ష నాయకులు



పీలేరులో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి దారుణమని ప్రతిపక్షాలు, జర్నలిస్టులు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడిచేసిన వైసీపీ మూకలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని మదనపల్లెలో ప్రతిపక్షాలు, కులసంఘాలు, ప్రజాసంఘాలు నిర్వహించిన నిరసనలు పెల్లుబికాయి. కలంపై జులుం నశించాలంటూ సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద మదనపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం పార్టీ నాయకులతో పాటు మాలమహానాడు, బహుజన సేన, ఎమ్మార్పీఎస్, రాయల్‌యూత్ సొసైటీ నాయకులు, వాల్మీకిసంఘం నాయకులు, బీసీ హక్కుల పోరాటసమితి నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ మాట్లాడుతూ సీఎం పాల్గొన్న సభలో నిజానిజాలు తెలిపేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దారుణమన్నారు. జగన్ ఖబడ్దార్ వచ్చేది టీడీపీ ప్రభుత్వమే అని ఆయన స్పష్టం చేశారు. టౌన్ బ్యాంకు మాజీచైర్మన్, టీడీపీ నేత నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ శ్రీకృష్ణపై దాడి చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. జనసేన రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి మాట్లాడుతూ విపక్షాలు తల చుకుంటే సాక్షి పత్రిక విలేకర్లు బయట తిరిగేవారా? అని ప్రశ్నించారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వర్గాలపై దాడులు చేయడం సహజంగామారందిన్నారు. మరో నేత శ్రీరామ రామాంజులు మాట్లాడుతూ శ్రీకృష్ణపై జరిగిన దాడి చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అని ప్రశ్నించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం మాట్లాడుతూ రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసే జగన్ పాల నలో దళితులు, మహిళలు, జర్నలిస్టులపై దాడి చేయడం నిత్యకృత్య మైందన్నారు. బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్ మాట్లాడు తూ శ్రీకృష్ణపై జరిగిన దాడిని సీఎం జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి ఖండించకపోవడం బాధకరమన్నారు. సీపీఐ నాయకులు టి.కృష్ణప్ప, సాంబశివ, మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నేత ఎస్‌ఏ మస్తాన్, బీసీ విభాగం అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, యశశ్విరాజ్, పట్టణ, మండల అధ్యక్షులు భవానిప్రసాద్, దేవరింటి శ్రీనివాసులు, అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, రాటకొండ మధుబాబు, పఠాన్ ఖాదర్‌ఖాన్, సాకే కృష్ణమూర్తి, చంద్రశేఖర్, షంషీర్, నాగూర్‌వలి, నవీన్‌చౌదరి, నాగమణి, జనసేన జిల్లా ప్రధానకార్యదర్శులు జంగాల శివరామ్, దారం అనిత, రాయల్‌యూత్ రేగంటి ప్రసాద్‌కుమార్, ఎమ్మార్పీఎస్ వాసు, రవీంద్ర, బీసీ హక్కుల సమితి అధ్యక్షుడు బోడెం రాజశేఖర్, వీఆర్‌పీఎస్ నేతలు పొదల నరసింహులు, నాగినేని గోవిందు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దాడి ఘటనపై నిరసన

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సిద్ధం సభలో వైసీపీ నాయకులు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గం నాయకుడు రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్, దోపిడీ రాజ్యాం పోవాలని నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా, మహబూబ్‌పీర్, అలీ, సయ్యద్, వెంకటరమణ, నాగరాజ, ఈశ్వరమ్మ, మీనాకుమారి, చల్లానాని, రవీంద్ర పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ సభ్యుల ధర్నా

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19: రాప్తాడు సభలో సీఎం జగన్ సమక్షంలోనే ఆంధ్రజ్యోతి ఫోటోజర్నలిస్టు శ్రీకృష్ణపై అల్లరిమూకలు దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మదనపల్లె ప్రెస్‌క్లబ్ సభ్యులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రమేశ్, ప్రెస్‌క్లబ్ సభ్యులు జె.శ్రీనివాసులు, శివారెడ్డి, శివకుమార్, గోపి, నక్కింటి మోహన, బాలనాగు, మధుసూదన్, శేఖర్‌బాబు, సీతారామ్, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, రవి, గోపాల్, మైసూర్ శీనా, శ్రీనివాసులు, ప్రసాద్, ఏఆర్ సురేష్, నానబాల కుమార్, కేశవరెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని బీవైఎస్ నిరసన

వైసీపీ పాలనలో జరుగుతున్న అరాచకాలను చూడలేమని బీవైఎస్ అధ్యక్షుడు పునిత్‌కుమార్ మండి పడ్డారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద బహుజన యువసేన ఆధ్వర్యంలో యువకులు కళ్లకు గంతలు కట్టుకుని రాస్తారోకో నిర్వహించారు. శ్రీకృష్ణపై దాడి చేసిన దుండగులపై హత్యాయత్నం కేసు పెట్టి,అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరీష్, సుధాకర్, ఆదినారాయణ, శశి, బాలు, జగదీష్, దేవేష్, శాండీ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

పీలేరు, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై రాప్తాడులో జరిగిన దాడి అమానుషమని ఖండిస్తూ సోమవారం పీలేరులోని పాత్రికేయులు, పలు పార్టీలు, ప్రజాసంఘాల నేతలు మండిపడ్డారు. ఆంధ్రజ్యోతి సిబ్బందిపై దాడిని ప్రజాస్వామ్య వ్యవస్థతోపాటు నాలుగో స్తంభంగా పిలవబడే పత్రికా వ్యవస్థపై దాడిగానే పరిగణించాలన్నారు. కృష్ణపై దాడిని గర్హిస్తూ సోమవారం పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. సైకో పాలకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని అక్కడే ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఆ తరువాత అక్కడి నుంచి ర్యాలీగా స్థానిక రెవెన్యూ, పోలీసు అర్బన్ సీఐ కార్యాలయానికి చేరుకుని అక్కడ తహసీల్దారు మహబూబ్ బాషాకు, సీఐ మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పురం రామ్మూర్తి, వసంతాల రాజా, లక్ష్మీకర, సురేంద్ర, షామియాన జయన్న, పురుషోత్తం రెడ్డి, రహంతుల్లా, కంచి సూరి, నల్లారి రియాజ్, కప్పరం చంద్రయ్య, హనీఫ్, షరీఫ్, వెంకటరమణ నాయక్, మహమ్మద్‌పీర్, ఎన్టీఆర్ నఫీస్, గోవర్ధన్ రెడ్డి, అమరనాథరెడ్డి, సయ్యద్ బాషా, భాస్కర, జనసేన నాయకులు కలప రవి, గజేంద్ర, పవన్, మోహనకృష్ణ, బీజేపీ నాయకుడు పొత్తూరి శ్రీకాంత్, సీపీఐ నాయకుడు టీఎల్ వెంకటేశ్, వివిధ సంఘాల నాయకులు పూలకుంట శ్రీనివాసులు, గండికోట వెంకటేశ్, జెట్టి మల్లిఖార్జున, ధరణీ కుమార్, సుభాష్, జర్నలిస్టు సంఘాల నేతలు మల్లెల జాకీర్, చంద్రశేఖర్ రాజు, పఠాన్ జాకీర్, సుబ్రహ్మణ్యం, అల్తాఫ్, మస్తాన్, రవి, భరత్‌స్వామి, కుప్పరాతి శ్రీరాములు రత్నం, సురేంద్ర, పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: అంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై ముఖ్యమంత్రి జగన్ బహిరంగ సభలో దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టడం సమంజసం కాదని మాజీ జడ్పీటీసీ వసంతమునిరత్నం పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి జరిగి రెండు రోజులు కావస్తున్నా దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడంలో పోలీసుల విఫలం చెందారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, విజయ్, సూర్యప్రకాష్, చంద్ర తదితరులు వున్నారు.

కలకడలో: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ వర్గీయులు దాడి చేయడం దారుణమని పీలేరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఆయన కలకడలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి పత్రికల స్వేచ్ఛను హరించేలా బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. నాయకులు శ్రీనివాసులరెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఖండన

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ శ్రేణులు దాడి చేయడాన్ని టీడీపీ సీనియర్‌నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. దోషులను కఠినంగా శిక్షించి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రామసముద్రంలో: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం అమానుషం, అనాగరిక చర్య అని మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి సీతప్ప పేర్కొన్నారు. రాప్తాడులో ఆదివారం జరిగిన ఘటనను హేయమైన చర్య అని వారు విమర్శించారు. టీడీపీ నాయకులు రాజేష్, చినుస్వామి, టేకుపల్లి రమణ, కోవ కృష్ణమూర్తి, బోయ రమణ, ప్రశాంత్, కృష్ణంరాజు, మాజీ జడ్పీటీసీ శివశంకర్‌లు నిరసన వ్యక్తం చేశారు.

బి.కొత్తకోటలో: రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణారహిత దాడిని అమానవీయ, హేయమైన చర్యగా పలువురు పేర్కొన్నారు. ఈ దాడికి నిరసనగా బి కొత్తకోట జ్యోతిచౌక్ లో సోమవారం పాత్రికేయులు, అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాలు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌ఎం పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని దుయ్యబట్టారు. నియోజకవర్గ పోల్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు, సీపీఐ నాయకుడు సలీంలు మాట్లాడారు. అనంతరం పాత్రికేయులు తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ సాయినాథ్, బీజేపీ నాయకుడు రవీంద్ర, అఖిలపక్ష నాయకులు నారాయణస్వామిరెడ్డి ప్రసాద్, కుమార్, రఘునాథ్, ఈశ్వర్, దుమ్ముచిన్నా, సచిన్, భవానివెంకటేశ్, సుకుమార్, సమీవుల్లా, జర్నలిస్ట్ నాయకులు లోకనాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, మోబిద్, రాజా రెడ్డి, బాబ్‌జాన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణా రహితంగా దాడి చేసిన సైకోలను కఠినంగా శిక్షించాలని తంబళ్ళపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఏ మాత్రం గౌరవించకుండా దాడి చేశారన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వమే కాలరాస్తోందన్నారు.

వాల్మీకిపురంలో: ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల పైసాచిక దాడిని ఖండిస్తూ సోమవారం వాల్మీకిపురంలో టీడీపీ, జనసేన పార్టీలు, పాత్రికేయులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక పాత బస్టాండ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ వినతిపత్రం అందజేశారు. జర్నలిస్ట్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

జగన్‌కు పేదల గురించి మాట్లాడే అర్హత లేదు



పీలేరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 19: భూస్వామ్య, పెత్తందారీ నాయకుడిగా చెలామణి అవుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి పేదల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని పీలేరు టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేఖరుల సమావేశంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికల్లో గెలిచిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఎమ్మెల్యేలకు వారి స్వంత నియోజకవర్గాల్లోనూ విలువ లేకుండా చేసిన నాయకులు ఏ పార్టీలో ఉన్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. మీడియా కో-ఆర్డినేటర్ పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ దేశంలోనే ధనికుడైన ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పేదలు, పేదల కష్టాల గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు పురం రామ్మూర్తి, అమరనాథరెడ్డి, స్పోర్ట్స్ మల్లి, పురుషోత్తం రెడ్డి, నల్లారి రియాజ్, రెడ్డిముని, అబ్బవరం సురేశ్, అత్తార్ చాను, వెంకటరమణ నాయక్, ఆబిద్, మహమ్మద్‌పీర్, జనసేన నాయకుడు గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి



రాష్ట్ర సంచార జాతుల సంఘం సమావేశంలో పాల్గొన్న నాయకులు

కలికిరి, ఫిబ్రవరి 19: రాష్ట్రంలోని సంచార జాతులకు రాజ్యాంగపరంగా సంక్రమించిన హక్కులను ప్రభుత్వం అమలు చేయాలని రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసులు డిమాండు చేశారు. సోమవారం కలికిరిలో సంచార జాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో జరిగిన సంచార జాతుల హక్కుల సమాజం భేటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంచార జాతులకు కనీసం 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. సంచార జాతుల జనాభాను సర్వే చేసి ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యేకి పార్టీలు టికెట్లు కేటాయించాలన్నారు. తమ డిమాండ్లకు సానుకూలంగా మద్దతు ఇచ్చే పార్టీకే రాబోయే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని శ్రీనివాసులు స్పష్టం చేశారు. సమా వేశంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోట లక్ష్మి, ఉపాధ్యక్షుడు కటారి రవీంద్ర, కోశాధికారి సుబ్రమణ్యం, రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గోవిందు సంపంగి, జిల్లా కార్యదర్శి తోట రాజా, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పసుపులేటి సుబ్రమణ్యం పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడుగా గోవిందు వెంకట్రమణతోపాటు కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: పదో తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విద్య, వైద్య, విద్యుత్, పోలీసు, ట్రెజరీ తదితర శాఖల అధికారులతో మార్చి 18 నుంచి 30 వరకు జరగబోయె పదో తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పదో తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలకమైనా పాత్ర పోషిస్తాయన్నారు. జిల్లాలో 129 కేంద్రాలలో 25,522 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవు తున్నారని వారిలో 3056 ఇంతకు ముందు ఫెయిలైనా వారు ఇప్పుడు రాయబోతున్నారన్నారు. ఈ పరీక్షకు 13,003 మంది బాలురు, 12,519 మంది బాలికలు, 3051 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకండా అన్నిరకాల వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధించండి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న పురుషోత్తం


కలికిరి, ఫిబ్రవరి 19: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన చేయాలని మదనపల్లె ఉప విద్యా శాఖాధికారి పురుషోత్తం ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన స్థానిక ఇందిరమ్మ కాలనీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పదో తరగతిలో మంచి ఫలితాలు రాబట్టడానికి సరైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులకు పాఠ్య ప్రణాళికలు, అన్ని రకాల పుస్తకాలను సమగ్రంగా బోధించేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంపత్ కుమార్, ఉపాధ్యాయులు వరప్రసాద్ రెడ్డి, ముబారక్ బాషా, ఉష, సహదేవయ్య, రామానుజమ్మ, సరస్వతి, రఘు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి మంచి ఉత్తీ ర్ణత సాధించాలని ఎంఈవో మునీంద్రనాయక్ పేర్కొన్నారు. సోమవారం కేజీబీవీలో జరిగిన ఇంటర్, పది విద్యార్థుల వీడ్కోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్య త్‌లో కూడా చదువుల్లో రాణించి ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, రాధ, అనిత పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: వివిధ కారణాలతో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మరో వారం రోజుల గడువు కేటాయిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 వరకు అర్హులైన జర్నలిస్టులు ఉండి వెబ్‌సైట్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే 6 జనవరి, 2024 వరకు అంటే నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోని వారికి, నమోదు చేసుకున్నప్పటికీ సబ్మిట్ కొట్టని వారికి ఆయా జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు.

భూకబ్జాలను అడ్డుకోని అధికారులపై చర్యలు చేపట్టండి



ధర్నా చేస్తున్న సీపీఐ, బీకేఎంయూ నాయకులు

కురబలకోట, ఫిబ్రవరి 19: భూకబ్జాలను అడ్డుకోని రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు కృష్ణప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ బీకేఎంయూల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్ప మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అధికార పార్టీకి చెందిన నేతలు కబ్జాలు చేసి యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపించారు. అంతేకాకుండా అధికార నేతలకు రెవెన్యూఅధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నార ని ధ్వజమెత్తారు. రెవెన్యూఅధికారులపై ఏసీబీ దాడులు చేయాలన్నారు. అంగళ్ళు, తెట్టు పంచాయతీలోని 859, 628,118 సర్వేనంబర్లలోని విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమిం చుకుని నిర్మాణాలు చేపడుతున్న అటువైపు కనీసం కన్నెత్తి చూసిన పాపాన పోలేద న్నారు. కంటేవారిపల్లె జగనన్న కాలనీలో అధికార పార్టీ నేతలు దాదాపుగా 50ఇళ్లను బినామీ పేర్లతో అర్హతలేని వారికి ఇచ్చారన్నాని ఆరోపించారు. యర్రబల్లి పంచాయతీలో ని 1871-1,3లోని 4ఎకరాల 47 సెంట్ల భూమిని 1997లో మంజూరు చేయగా ఆభూమిని వీఆర్వో శ్రీనివాసులురెడ్డి, తహశీల్దార్‌లు మరొకరికి పాసుపుస్తకాన్ని మంజూరు చేశారని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్ప, చంద్రశేఖర్, వీరమ్మ, రెడ్డెమ్మ, లక్ష్మ మ్మ, నర్సింహులు, శంరక, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 19: మండల రైతులు ఈకేవైసీని తప్పని సరిగా చేసుకోవాలని వ్యవసాయ అధికారి మురళిమోహన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 846మంది రైతులకు సంబంధించి 1265ఎకరాలలో రైతులు సాగు చేసిన పంటల రకాలను ఈకేవైసీ చేశామన్నారు. ప్రభుత్వం ఈకేవైసీ చేసుకొనేందుకు ఈ నెల 23వరకు గడువు పెంచిందన్నారు. ఇంకా ఈకేవైసీ చేసుకోని రైతులు గడువులోగా సాగు చేసిన పంటలకు ఈకేవైసీ చేసుకోవాలని దీంతో ప్రభుత్వ పథకాలకు అర్హులు కావడంతో పాటు పండిచించిన ధాన్యాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు.

పెద్దమండ్యం బీజేపీ అధ్యక్షుడిగా లక్ష్మినారాయణ



పెద్దమండ్యం, ఫిబ్రవరి 19: పెద్దమండ్యం మండల బీజేపీ అధ్యక్షుడుగా ముత్యాల లక్ష్మినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు రాజం పేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని సిద్దవరం గ్రామ పంచాయతీ చెరువుముంద రపల్లెకు చెందిన లక్ష్మినారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దమండ్యంలో త్వరలో బీజేపీ మండల కొత్త కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతం చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాష్ట్ర సీనియర్ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి. బీజేపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హంద్రీ-నీవా కాలువను కాపాడండి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి19: మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కాలువను, కాలువ గట్టులను కాపాడాలని మాలమహానాడు రాష్ట్రఅధ్యక్షుడు యమల సుదర్శనం డిమాండ్ చేశారు. సోమవారం హంద్రీ-నీవా ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువ గట్టులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించి కాలువ గట్టుపై తారు రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. అక్రమణ దారులపై చర్యలుతీసుకోవాలని లేనిపక్షంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. నాయకులు మనోహర్, చంద్రయ్య, మోహన్, తదితరులుపాల్గొన్నారు.

రోకలిబండతో అత్తపై అల్లుడు దాడి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 19: రోకలిబండతో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం మండలం బోనుమలకు చెందిన రెడ్డెమ్మ తన కుమార్తెను నిమ్మనపల్లి మండలం వెంగంవారిపల్లి పంచాయతి కొండసానివాపల్లికు చెందిన రమణకు ఇచ్చి వివాహం చేసింది. అయితే అల్లుడు రమణ తన కుమార్తెను కొట్టడంతో అల్లుడిని ఎందుకు కొట్టావని నిలదీసింది. దీంతో అల్లుడు రమణ , తన తమ్ముడు శ్రీనాథ్‌లు ఇంట్లో వున్న రోకలిబండతో దాడి చేయడంతో రెడ్డెమ్మ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబీకులు మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మల్లయ్య కొండకు ప్రత్యేక సర్వీసులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 19: ప్రముఖ శైవక్షేత్రం తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5 గంటలకు, 6.30 గంటలకు తంబళ్లపల్లె మల్లయ్యకొండకు బస్సుల నడుస్తాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు.

భూ సమస్యలే అధికం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19: స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో భూ సమస్యలే అధికంగా వచ్చాయి. సబ్‌కలెక్టరేట్ డీఏవో రఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రజలు వారి సమస్యలపై అర్జీలు అందజేశారు.

శ్రీనివాసుడికి వైభవంగా పుష్పయాగం



శ్రీవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 19: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి వారికి వైభవంగా పుష్పయాగం చేశారు. గత పదకొండు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం పుష్పయాగ మహోత్సవంతో ముగిసాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు వేకువజామున వేదపండితులు శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులకు వేద మంత్రాల నడుమ పుష్పయాగ మహో త్సవం కనులపండువగా సాగింది. భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చి శ్రీవారి పుష్ప యాగాన్ని తిలకించి తరించారు. కార్యక్రమంలో ఏఈవో గోపినాథ్, ఆలయ ఇన్స్‌పెక్టర్ దిశంత్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ మహారాజ్ చిత్ర పటం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రామసముద్ర, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంలో వైభవంగా నిర్వహించారు. మండలంలోని బజరంగ్ దళ్ యువసేన, ఛత్రపతి శివాజీ అభిమానులు, నాయకులు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసివేడుకలు జరుపుకున్నారు. బజరంగ్ దళ్ యువసేన ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు చలపతి, గంగరాజు, శేఖర్, మహేష్, వాల్మీ కి కిట్ట, రాజేష్, హరి, మెడికల్ కృష్ణరెడ్డి, గౌతమ్, వేణు, సుమో మంజు పాల్గొన్నారు.

కలికిరిలో: స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. క్రాస్‌రోడ్డులోని గాంధీ విగ్రహం ముందు శివాజీ చిత్రపటాన్ని వుంచి పూలమాలలు వేసి జోహార్లు పలికారు. ఆయన ధైర్య సాహసాలను కొనియాడారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్.రాజేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: మదనపల్లె బీజేపీ పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఆశయాల అనుగుణంగా హిందూ ధర్మం కోసం సమసమాజ స్థాపన కోసం అహర్నిలుపోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. నాయకులు భవాని, మురళిమోహన్, కొండయ్య, వెంకటరమణ రెడ్డి, సంతోష్, శంకర్‌రెడ్డి, పవర్‌బాబు, దివాకర్, మల్లికార్జున, మల్లయ్య నాయక్, తేజశ్రీ, గణపతి, బాలసుబ్రహ్మణ్యం, నాగరాజ పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే జగన్ పోవాలి : టీడీపీ

వాల్మీకిపురం, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో ప్రజలు బాగుపడాలన్నా, సైకో సీఎం జగన్ పోవాలని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందుగా స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని నల్లవీరగంగాభవాని అమ్మవారి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ వెంకటరమణ, తెలుగు యువత చాను, ఆనంద్, యూసుఫ్, బషీర్, అబ్బాస్, మొహ్మద్‌ఆలీ, రెడ్డిరామ్, సర్దార్, మౌలా, గోవింద్, రెడ్డిరామ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య : నల్లారి

పీలేరు/కలికిరి, ఫిబ్రవరి 19: రాప్తాడులో సీఎం జగన్ సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పైన జరిగిన దాడి తీవ్రమైన నేరపూరిత హేయమైన చర్య అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఖండించారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిందిపోయి వారిపై దాడులు జరపడాన్ని ప్రోత్సహించడం జగన్ ఫ్యాక్షనిజానికి నిదర్శనమని తేటతెల్లమవుతోందని విమర్శించారు. మీడియా విమర్శలను ఓర్చుకోలేని నియంతలకు పరిపాలించే అర్హత లేదని దుయ్యబట్టారు.

ప్రభుత్వ పాలన ఎలాంటిదో తేల్చాల్సింది ప్రజలే!

బహిరంగ సభల్లో అబద్ధాలు చెపతూ ప్రజల్ని మోసం చేయాలని ప్రయత్నిస్తున్న సీఎం జగన్ పాలన గురించి తేల్చాల్సింది ప్రజలేనని అందుకు సన్నద్ధులై సిద్ధంగా ఉన్నారని కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక్క చాన్స్ అంటూ గత ఎన్నికల్లో ప్రాధేయపడి ప్రజల్ని తప్పుదోవ పట్టించిన జగన్ మరో రెండు చాన్సులంటూ మళ్ళీ మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఫ్యాను రెక్కలు ముక్కలు కావడం ఖాయం

● తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్

ములకలచెరువు, ఫిబ్రవరి 19: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను రెక్కలు ముక్కలు కావడం ఖాయమని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరిది అభివృద్ధి పాలనో, ఎవరిది విధ్వంస పాలనో ప్రజలకు బాగా తెలుసునన్నారు. బూటకపు ప్రసంగాలు మాని దమ్ముంటే వైసీపీ నేతలు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. సీఎం జగన్ నోటి నుంచి వచ్చేవి అన్నీ అసత్యాలు, బూటకపు ప్రసంగాలేనన్నారు. అక్రమంగా మైన్స్, వైన్ సాండ్‌లలో లక్షల కోట్లు సంపాదించిన వైసీపీ నేతలు నీతులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికార దుర్వినియోగంతో సిద్ధం సభలు పెట్టి ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తున్నారన్నారు.

రాష్ట్రాన్ని జగన్ అథఃపాతాళానికి తొక్కేశాడు

● మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి, టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 19: అవినీతి కేసుల్లో నిందితుడుగా వున్న జగన్ సీఎం అయ్యాక రాష్ట్రాన్ని అథఃపాతాళానికి తొక్కేశాడని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజావేదిక విధ్వంసంతో ప్రారంభించిన జగన్ పాలనలో అవినీతి, అరాచకాలు పేట్రేగిపోయాయన్నారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన సిద్ధం సభలో జగన్ టీడీపీ అధినేత చంద్రబాబుపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. సిద్ధం సభలో వైసీపీ కార్యకర్తలే విసిగిపోయి వెనుతిరిగి వచ్చేసారన్నారు. పత్రికా స్వేచ్ఛను కాలరాసే చర్యలను ప్రోత్సహిస్తున్న జగన్‌కు కాలమే బుద్ధిచెబుతుందన్నారు. పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌ను బహిరంగ చర్చకు సిద్ధమా అని చంద్రబాబు విసిరిన సవాల్‌కు జగన్ నుంచి ఇప్పటి వరకు జవాబు లేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, మేకల రెడ్డిశేఖర్, ఎస్‌ఎల్‌వీ రఘు, కత్తి లక్ష్మిన్న, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, చల్లా నరసింహులు, పి.శ్రీనివాసులు, కత్తి అరుణ్, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.